# భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా బొగ్గుని వినియోగించాలి

## బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగుకు కేంద్ర సహకారం కోరిన డిప్యూటీ సీఎం

## కోల్ ఇండియా తరహాలో గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై పనిచేసేందుకు సింగరేణి ఆసక్తి

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమావేశం





వెబ్ డెస్క్, బతుకమ్మ :బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ – II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్ – III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్–IIIను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్–II అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ–మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్– –II అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్–IIకు ఎంఎండీఆర్ చట్టం, 1957 లోని సెక్షన్–5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్–III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా.జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ – పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ – ప్రాజెక్ట్స్ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏర్గట్లలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసు నమోదు

ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన కేసును పోలీసులు నమోదు చేశారు. డిప్యూటీ తహ సీల్దార్ (సివిల్ సప్లైస్) వి. పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు, ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో సీఆర్.నెం. 29/2026గా కేసు నమోదైంది. టాస్క్ ఫోర్స్ అధికారుల విశ్వసనీ య సమాచారం ఆధారంగా, 2026 ఏప్రిల్ 28 అర్ధరాత్రి సమ యంలో టీఎస్16 యుడి 3297 నంబర్ గల గూడ్స్ వాహ నాన్ని అధికారులు పట్టుకున్నారు. ఆ వాహనంలో మొత్తం 77 పీడీఎస్ బియ్యం సంచులు ఉన్నట్లు గుర్తిం చారు. ఈ సంచులు తాడ్లరాంపూర్ గ్రామంలోని శ్రీ రామ రైస్ ఇం డస్ట్రీస్ ప్రాంగణంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వర్ని డిప్యూ టీ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) సంఘటనా స్థలానికి చేరుకుని, టాస్క్ ఫోర్స్, పోలీసుల సమక్షంలో రైస్ మిల్ వెయింగ్ బ్రిడ్జ్ వద్ద బియ్యాన్ని తూకం వేయించారు. మొత్తం 43.90 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం బియ్యాన్ని మోర్తాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి భద్రపరి చారు. తరువాతి రోజు అధికారులు తాడ్లరాంపూర్ గ్రామానికి చేరుకుని, స్వతంత్ర పంచుల సమక్షంలో మోర్తాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచిన బియ్యానికి నమూనా లు సేకరించారు. అలాగే రైస్ మి ల్లులో ఉన్న బియ్యం కుప్పల నుండి కూడా యాదృచ్ఛికంగా నమూనాలు తీసుకుని ప్రయోగశాలకు పంపిం చారు. రైస్ మిల్ యజమాని వాగ రవీందర్ రెడ్డి విచారణలో మాటా డుతూ, వాహనం తూకం కోసం మాత్రమే మిల్లులోకి వచ్చిందని, పోలీసులు రావడంతో డ్రైవర్ భయపడి దాక్కున్నాడని తెలిపాడు. ఈ వ్యవహారంతో తనకు సంబం ధం లేదని పేర్కొన్నాడు. అయితే వాహన డ్రైవర్ షేక్ షకీల్ ఇచ్చిన ప్రకటనలో, ఏర్గట్ల పరిసర గ్రామా ల్లోని రేషన్ కార్డు దారుల వద్ద నుండి కిలోకు రూ.16 చొప్పున పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి, వలస కార్మికులకు కిలోకు రూ.20 కి విక్రయించాలనే ఉద్దేశంతో తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. రైస్ మిల్ యజమాని, డ్రైవర్ ఇచ్చిన వివరణలు నమ్మశక్యం కాకపోవ డంతో, వారు గుప్తంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. టీపీడీఎస్ (కంట్రోల్) ఆర్డర్ 2016 లోని క్లాజ్ 17(ఈ) ప్రకారం పీడీఎస్ బియ్యం కొనుగోలు, అమ్మకం నేరంగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఐపీసీ 318(హెచ్), ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 7, టీపీడీఎస్ యాక్ట్ సెక్షన్ 17(ఈ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే టీఎస్16 యుడి 3297 వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కలెక్టర్ (సివిల్ సప్లైస్), నిజామాబాద్ ఆదేశాల వరకు భద్రపరచాలని నిర్ణయించారు.

# సెరిబ్రల్ మలేరియా అంటే ఏమిటి..

## ఎలాంటి దుష్ప్రభావాలు ఎదురవుతాయి..

# ఏం చేయాలి..

దోమ కాటు కారణంగా వచ్చే విష జ్వరాల్లో మలేరియా కూడా ఒకటి. ప్రతి సంవత్సరం ఈ జ్వరానికి అనేక మంది గురవుతూ ఉంటారు. అయితే దోమకాటు వల్ల వచ్చే మలేరియా సాధారణంగా జ్వరం, వణుకు, చెమటలు, అలసట వంటి లక్షణాలతో కనిపిస్తుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఇది మెదడుపై ప్రభావం చూపే అత్యంత ప్రమాదకర స్థితికి చేరుతుంది. అలాంటి తీవ్రమైన పరిస్థితినే సెరిబ్రల్ మలేరియాగా పిలుస్తారు. ఇది సమయానికి చికిత్స అందకపోతే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెరిబ్రల్ మలేరియా అనేది ప్రధానంగా ప్లాస్మోడియం ఫాల్సిపేరమ్ అనే మలేరియా పరాన్నజీవి కారణంగా ఏర్పడే తీవ్రమైన నర సంబంధిత సమస్య. ఈ పరాన్నజీవి సోకిన ఎర్ర రక్తకణాలు మెదడులోని చిన్న రక్తనాళాలకు అంటుకుని రక్తప్రసరణను అడ్డుకుంటాయి. దాంతో మెదడులో వాపు, ఆక్సిజన్ సరఫరా తగ్గడం, మెదడు పనితీరు దెబ్బతినడం జరుగుతుంది. తీవ్రమైన సందర్భాల్లో కోమా పరిస్థితి కూడా వచ్చే అవకాశాలు ఉంటాయి.

**వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశం..**

సాధారణ మలేరియాతో పోలిస్తే సెరిబ్రల్ మలేరియా చాలా వేగంగా తీవ్రరూపం దాల్చుతుంది. మొదట జ్వరం, తలనొప్పి, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపించినా, తరువాత గందరగోళం, ప్రవర్తనలో మార్పులు, మాట తడబడటం, ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడం వంటి నర సంబంధిత లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణీలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. దేశంలో వర్షాకాలం, వర్షాల అనంతరం దోమల పెరుగుదల అధికంగా ఉండటంతో ప్రమాదం మరింత పెరుగుతుంది. సెరిబ్రల్ మలేరియా ప్రమాదకరంగా మారడానికి ప్రధాన కారణం మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోవడమే. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడటంతో పాటు ఇన్‌ఫ్లమేషన్ కారణంగా తలలో ఒత్తిడి పెరుగుతుంది. చికిత్స ఆలస్యమైతే కొన్ని గంటల్లోనే శాశ్వత మెదడు నష్టం కలిగే ప్రమాదం ఉంటుంది. ప్రాణాపాయం నుంచి బయటపడిన వారిలో కూడా జ్ఞాపకశక్తి సమస్యలు, చదువులో ఇబ్బందులు, ప్రవర్తనా మార్పులు వంటి దీర్ఘకాల ప్రభావాలు కనిపిస్తాయి.

# మహిళ ఎస్సైని వేధించిన ఎస్ఐపై కేసు నమోదు

## విఆర్‌కు అటాచ్ చేస్తు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు



వెబ్‌డెస్క్, బతుకమ్మ:పాత పాలమూరు జిల్లాలో ఒక ఎస్ఐ తన తోటి బ్యాచ్ మెట్ ఐన మహిళ ఎస్ఐని లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేర కు విచారణ చేపట్టిన పోలీస్ శాఖ సధరు ఎస్ఐ వేధింపులు వాస్తవమేనని గుర్తించి కేసు నమోదు చేయగా అతడిని వెకేన్సీ రిజర్వ్‌కు అటాచ్ చేస్తు నారా యణ పేట్ జిల్లా ఎస్పీ డా.వినీత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నారా యణ పేట జిల్లా మద్దూర్ ఎస్ఐగా విజయ్ కుమార్ విధులు నిర్వహి స్తున్నాడు. విజయ్‌కుమార్‌తో పాటు ఎస్ఐగా ఎన్నికైన మహిళను లైంగీ కంగా వేదించాడు. తన తోటి బ్యాచ్ మెట్ అని చూడకుండా వేదిం చడంతో బాధితురాలు నారాయణ పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారించిన పోలీస్ శాఖ అతడిపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ విజయ్‌కుమార్‌పై లైంగీక వేధింపుల కేసు నమోదు కావడంతో అతడిని విఆర్‌కు అటాచ్ చేస్తు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

# పెద్దపెల్లి ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళ మాదిగ విభాగం నాయకురాలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో దళితులపై జరుగుతున్న వివక్షను ఖండిస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహిళ మాదిగ విభాగం జిల్లా ఇన్‌చార్జ్ ఆదరి సరిత మాదిగ తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు. పెద్దపెల్లి జిల్లా పెగడపల్లి గ్రామంలోని రేణుక ఎల్ల మ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా దళితుల బోనాలను అడ్డుకో వడంతో పాటు వారిని ఆలయంలోకి అనుమతించకపోవడం సభ్య సమా జం తలదించుకునే ఘటన అని ఆమె పేర్కొన్నారు. దేవతలు, దేవుళ్ల దృష్టిలో అందరూ సమానమేనని, అలాంటి పవిత్ర స్థలాల్లో కుల వివక్షకు చోటు ఇవ్వడం క్షమించరాని చర్య అని ఆమె అన్నారు. ఆధునిక సమా జంలో కూడా అంటరానితనం ఇంకా కొనసాగుతుండడం దురదృష్ట కరమని వ్యాఖ్యానించారు. దళితులను అవమానించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశా రు. లేనిపక్షంలో మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనపై స్థానికంగా చర్చ జరుగుతుండగా, దళిత సంఘాలు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాయి.

# వృద్ధుల్లో కార్టిలేజ్‌ను పెంచి ఆర్థరైటిస్‌ను తగ్గించే కొత్త చికిత్స.. సైంటిస్టుల అభివృద్ధి..



వయసు పెరిగే కొద్దీ మోకాళ్ల నొప్పులు, కీళ్లు దెబ్బతినడం వంటి సమ స్యలు తలెత్తుతూ ఉంటా యి. ఈ సమస్యలతో చాలా మంది ఇబ్బంది పడుతూ ఉంటారు. ము ఖ్యంగా ఆస్టియోఆర్థ్రైటిస్ కారణంగా కీళ్లలోని కార్టిలేజ్ క్రమంగా తగ్గి పోవడం వల్ల నడవడం కూడా కష్టమవుతోంది. అయితే ఇప్పుడు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకవచ్చనే ఆశలను పెంచుతూ అమెరికాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కీలకమైన పరిశోధన ఫలితాలను వెల్లడించారు. శాస్త్రవేత్తలు 15-పీజీడీహెచ్ అనే ఒక ప్రత్యేక ప్రోటీన్ వయసు పెరిగే కొద్దీ ఎక్కువగా పనిచేస్తూ కీళ్లలోని కార్టిలేజ్‌ను దెబ్బతీస్తుందని గుర్తించారు. ఈ ప్రోటీన్ శరీరంలో టిష్యూలను మరమ్మత్తు చేసే, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే సహజ ప్రక్రియలను అడ్డుకుంటుందని పరిశోధనలో తేలింది. పరిశోధనలో భాగంగా ఈ ప్రోటీన్ పనిచేయకుండా చేసే ఔషధాన్ని వృద్ధ ఎలుకలకు ఇవ్వగా, దెబ్బతిన్న మోకాలి కార్టిలేజ్ మళ్లీ మందంగా మారినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

**ఆస్టియో ఆర్థరైటిస్‌ను సైతం..**

అలాగే చిన్న వయసు ఎలుకల్లో గాయాల తర్వాత వచ్చే ఆస్టియో ఆర్థ్రైటిస్‌ను కూడా ఈ చికిత్స పూర్తిగా అడ్డుకుందని తెలిపారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ పునరుద్ధరణకు స్టెమ్ సెల్స్ అవసరం రాలేదని పరిశోధకులు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న కార్టిలేజ్ కణాలు అయిన కాండ్రోసైట్స్‌ను మళ్లీ ఆరోగ్యకర స్థితికి మార్చడం ద్వారా ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. చికిత్స పొందిన ఎలుకలు మెరుగ్గా నడవడమే కాకుండా గాయపడిన కాళ్లపై ఎక్కువ బరువు పెట్టగలిగాయని, దీని వల్ల నొప్పి కూడా తగ్గినట్లు గుర్తించారు.

**మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స చేయిస్తే..**

ఈ ప్రయోగాలను మనుషుల కీళ్ల టిష్యూలపై కూడా పరీక్షించారు. మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రోగుల కార్టిలేజ్ నమూనాల్లో కొత్త కార్టిలేజ్ పెరుగుదలతోపాటు ఇన్‌ఫ్లమేషన్ తగ్గిన సంకేతాలు కనిపించాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇటీవల కీళ్ల ఆరోగ్యంపై మరికొన్ని ఆసక్తికరమైన పరిశోధనలు కూడా వెలుగులోకి వచ్చాయి. మధుమేహం, బరువు తగ్గించే మందుగా ప్రసిద్ధి చెందిన ఒజెంపిక్ లో ఉండే సెమాగ్లుటైడ్ కార్టిలేజ్ కణాల పనితీరును మెరుగుపరచి కీళ్లను రక్షిస్తుందని మరో అధ్యయనం సూచించింది. అలాగే యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్ శాస్త్రవేత్తలు కొన్ని వారాల్లోనే ఆస్టియోఆర్థ్రైటిస్‌ను తగ్గించే ఇంజెక్షన్ చికిత్సపై పనిచేస్తున్నారు. 15-పీజీడీహెచ్ ప్రోటీన్‌ను అడ్డుకునే ఔషధంపై ఇప్పటికే భద్రతా పరీక్షలు కూడా పూర్తయ్యాయని, ఇప్పటివరకు పెద్దగా దుష్ప్రభావాలు కనిపించలేదని పరిశోధకులు తెలిపారు. త్వరలోనే మానవులపై క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు.